వరదల సమయం ఆసన్నం

- గోదావరి గట్ల పటిష్టతపై కానరాని శ్రద్ధ
- ఫ్లడ్ స్టోర్లకు సామగ్రి కొనుగోలుకు అధికారుల ప్రతిపాదన
- నేటికీ సమకూర్చని ప్రభుత్వం

రావులపాలెం: విపత్తు వస్తేనే ప్రభుత్వాలు, అధికారులు మేల్కొంటారు తప్పా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోరు. అయితే ప్రతి ఏడాది వచ్చే గోదావరి వరదల విషయంలో కాస్తా ముందస్తుగా చర్యలు తీసుకుంటే వరదల సమయంలో జరిగే ప్రమాదాన్ని, భారీ నష్టాన్ని నివారించవచ్చని స్థానికులు అంటున్నారు. మే నెల పూర్తయింది. జూన్‌లో రోహిణీ కార్తె కూడా ముగిసింది. ఇక మృగశిర కార్తె ప్రారంభం వర్షాలకు ఆరంభం. గోదావరి సమీపంలో కానీ, పై భాగంలో కానీ వర్షాలు తీవ్రమైతే వరద ఉధృతి పెరుగుతుంది. వరద ప్రవాహ ధాటిని తట్టుకోవాలంటే ఏటిగట్లను బలోపేతం చేయాలి. అందుకు ముందస్తుగానే చర్యలు చేపట్టాలి. అడపా దడపా చినుకులు పడుతుండటంతో గట్ల పటిష్టత పనులకు ఆటంకం ఏర్పడే అవకాశాలున్నాయి. కొత్తపేట నియోజకవర్గం పరిధిలో గోదావరి లంక గ్రామాల అనేకం ఉన్నాయి. వరద సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కానీ, మండల స్థాయి అధికారులతో కానీ ఇప్పటి వరకూ సమావేశాలను ఏర్పాటు చేయలేదు. లొల్ల, గోపాలపురం ఫ్లడ్ స్టోర్స్‌లో వరద రక్షణ సామగ్రి సరిపడా ఉన్నప్పటికీ సామగ్రిని మరింత సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఫ్లడ్ స్టోర్లను సన్నద్ధం చేయరూ..

గోదావరి గట్లు బలహీనపడినప్పుడు పటిష్ట పర్చేందుకు ఇసుక, సంచులు, భారీ గేటు కర్రలు, గడ్డపారలు, పారలు ఇతర సామగ్రి అవసరమవుతుంది. నియోజకవర్గంలో గౌతమి గోదావరి కుడి గట్టు, వశిష్ట గోదావరి ఎడమ గట్లను ఆనుకుని పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గం పరిధిలో లొల్ల లాకుల వద్ద, గోపాలపురం లాకుల వద్ద రెండు ఫ్లడ్ స్టోర్‌లున్నాయి. అయితే గట్లు పటిష్టంగా ఉండటంతో గత సంవత్సరంలో సమకూర్చుకున్న సామగ్రి దాదాపు సరిపోతుందన్న అంచనాకు అధికారులు వచ్చారు. ఇవి కాకుండా ఇతర ప్రాంతాల్లో అదనంగా సమాకూర్చుకోవాల్సిన చోట్ల ఇప్పటికే టెండర్లు పిలిచినట్టు సమాచారం. లొల్ల లాకుల వద్ద ఫ్లడ్‌స్టోర్‌లో 2 వేల సర్వేబాదులు, 2 వేల వెదురుబాదులు, 46 వేల ఖాళీ సిమెంట్ సంచులు, 1,070 క్యూబిక్ మీటర్ల ఇసుక, కత్తులు, పారలు, గొడ్డళ్లు సిద్ధంగా ఉన్నాయి.

గోపాలపురం లాకుల వద్ద ఇరిగేషన్ భవనం-2లో ఫ్లడ్‌స్టోర్ ఉంది. అయితే వశిష్ట ఎడమ గట్టు పరిధిలో మండలంలోని లక్ష్మీపోలవరం నుంచి గోపాలపురం వరకూ సుమారు మూడు కిలో మీటర్ల మేరలో గతంలో ఆరు చోట్ల వర్షపు బాటలు భారీగా పడటంతో స్థానికుల్లో వరదల సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. 2022 జూలై నెలలో గోపాలపురం వద్ద ఇలా పడిన వర్షపు బాటకు వరదల సమయంలో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రావెల్, ఇసుక, ఇసుక బ్యాగులు కట్టించి భారీ బాటను పూడ్చారు. కానీ అధికారులు మాత్రం మిగిలిన బాటలను పట్టించుకోలేదు. అయితే ఈ వర్షపు బాటలు ఏటిగట్టుకు కాలువ వైపు ఉంటే ప్రమాదం లేదని, గోదావరి వైపు ఉంటే అది కూడా సైజును బట్టి దాని ప్రమాద తీవ్రత ఉంటుదని చెపుతున్నారు. ఇటువంటి ప్రాంతాల్లో ఫ్లడ్ స్టోర్ వద్ద అధిక సామగ్రి సమకూర్చవడం మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అలాగే ప్రభుత్వం ముందస్తుగా సమకూర్చుకోవడం ద్వారా వరద సమయంలో ప్రమాదాలను నివారించుకునే అవకాశం ఉంటుంది.



గోపాలపురం వద్ద 2022 వరదల సమయంలో పటిష్టం చేయడానికి సంచుల్లో ఇసుక వేస్తున్న కూలీలు, అధికారులు

లంక గ్రామాల పరిస్థితి ఇలా..

కొత్తపేట నియోజకవర్గంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఆత్రేయపురం మండలం, రావులపాలెం మండలం, కొత్తపేట మండలంలో సుమారు 40 నుంచి 50 కిలోమీటర్ల మేర గౌతమి కుడి గట్టు, వశిష్ట ఎడమ గట్టు, ఆలమూరు మండలంలో గౌతమి ఎడమ గట్టున పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. వశిష్ట గట్టు సుమారు మూడు కిలోమీటర్ల మేర లక్ష్మీపోలవరం నుంచి గోపాలపురం వరకూ వర్షపు బాటలతో భయాందోళన కలిగిస్తుంటే, గౌతమి గట్టు మెర్లపాలెం నుంచి ఊబలంక మీదుగా రావులపాలెం వరకూ ఆధునీకరణ చేయకపోవడంతో కలవరపాటుకు గురి చేస్తుంది. గోదావరి తీరాన ఉన్నా గ్రామాల ప్రజలు వరదల సమయంలో భయాందోళన చెందాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రతి ఏటా వరదల సమయంలో ఊబలంక శివారు తోకలంక చుట్టూ వరద నీరు చేరి బయట ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఈ సమయంలో పాలనాపరమైన సమస్యలు ఎదురవుతుంటాయి. అక్కడి వ్యవసాయ క్షేత్రాలు, నివాస ప్రాంతాలు ముంపుబారిన పడతాయి. సాయం అందించేందుకు ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం నుంచి పడవల్లో ఆహార పదార్థాలను అధికారులు తరలిస్తుంటారు. లంక పొలాల్లో ఉత్పత్తులు నీటి మునిగి వాటి తరలించాలంటే నావలపై వెళ్లాల్సిన పరిస్థితులు ఉంటాయి. ఈ సమయంలో ఏటిగట్టు పటిష్టంగా లేకపోతే జరిగిన నష్టం తీవ్ర స్థాయిలో ఉంటుంది.



గోపాలపురం వద్ద 2022లో వరదల సమయంలో ప్రమాదంగా ఉన్న వర్షపు బాటను గ్రావెల్‌తో పూడుస్తున్న దృశ్యం

ముందస్తు చర్యలపై దృష్టి సారించాలి



వరద సమయంలో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గోదావరి గట్ల పటిష్టానికి తగిన చర్యలను వెంటనే చేపట్టాలి. అలాగే ఫ్లడ్ స్టోర్ సామగ్రి, ఇసుక అదనంగా ఉంచాలి,

– గొలుగూరి మునిరెడ్డి, ఉప సర్పంచ్, రావులపాలెం.

సరిపడా సామగ్రి ఉంది



లొల్లలాకుల వద్ద ఫ్లడ్ స్టోర్‌లో తగిన సామగ్రిని సిద్ధం చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలపై అప్రమత్తంగా ఉంటాం. వరద ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. – ఎం శివప్రసాద్, సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్, కొత్తపేట

క్లుప్తంగా

పార్టీని మరింత బలోపేతం చేయాలి



టేకిశెట్టిపాలెం వైఎస్సార్ సీపీ సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సూచించారు. సోమవారం టేకిశెట్టిపాలెంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జిల్లెళ్ళ చిట్టిబాబు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ సమస్యలపై కూటమి ప్రభుత్వ విధ్వంసపాలనపై ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆయన సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, రాపాక వినోద్, జిల్లెళ్ళ రాజశేఖర్, రాజ్ కాటన్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబాలకు సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: ఇటీవల వాకలగరువులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు స్థానిక పూర్వ విద్యార్థులు సాయం అందజేశారు. 2008 పదో తరగతి పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.30 వేలు విలువ చేసే నిత్యావసరాలు, దుస్తులను పంపిణీ చేశారు. దాకే ఆదిలక్ష్మి, ఇళ్ల ఆదిలక్ష్మి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా కార్యక్రమం చేపట్టిన పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.పది వేల విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కడలి రవికుమార్, లక్ష్మీప్రసన్న దంపతులు రూ.11 వేలు, అమలాపురానికి చెందిన మంత లలిత దంపతులు రూ.10 వేలు సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతలను అర్చక సిబ్బంది, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు అభినందించారు.

విద్యార్థినికి రూ.10 వేల సాయం



బడుగువానిలంకలో విద్యార్థి రమాదేవికి సాయం అందిస్తున్న దాతతో గ్రామస్తులు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకకు చెందిన విద్యార్థిని రమాదేవికి అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పాలూరి గోవిందరావు, దూలం తేజ, బండారు చిన్న చేతుల మీదుగా సోమవారం రూ.పది వేల ఆర్థికసాయం అందజేశారు. బడుగువానిలంకకు చెందిన దాత దూలం శ్రీనివాసు గతంలో చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్నాడు. అయితే సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని అదే పాఠశాలలో చదువుకున్న పేద విద్యార్థినిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఇటీవల పదో తరగతిలో 564 మార్కులు సాధించి ప్రథమస్థానం సాధించడంతో పాటు సూరంపాలెంలో పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో ఉచిత సీటు సాధించిన రమాదేవికి చదువులో ఆసరాగా ఉంటుందని ఈ సాయం అందించినట్లు దాత శ్రీనివాసు తెలిపారు. ఆర్థికంగా పేద కుటుంబమైన రమాదేవికి ఉచిత సీటు లభించినా ఇంకా ఫీజులు, పుస్తకాల రూపంలో అనేక ఖర్చులు ఉన్నందున దాతలెవరైనా స్పందించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

విఘ్నేశ్వరుని సన్నిధిలో మద్రాస్ హైకోర్టు జడ్జి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి వారిని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మాల దంపతులు సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వారికి ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు, వేద పండితులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జస్టిస్ మాల దంపతులకు వేదాశీర్వచనం పలికి, స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ విశిష్టతను, చరిత్రను వివరించారు.

ఘనంగా శివాజీ పట్టాభిషేక దినోత్సవం

కొత్తపేట: ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవాన్ని మండలంలోని వాడపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద శివాజీ విగ్రహానికి పాలూరి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యానందం మాట్లాడుతూ శివాజీ పట్టాభిషేకం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దివస్ జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో తొగరు ఆంజనేయులు, పెదపూడి బాపిరాజు, సంపతి కనకేశ్వరరావు, వరగన వరబాబు తదితరులు పాల్గొన్నారు.

పంటబోదె ఆక్రమణపై ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని గూడపల్లి పల్లిపాలెంలో పంట బోదె ఆక్రమణపై గ్రామస్తులు కాపిశెట్టి కనికేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తూరలు పెట్టి ఆక్రమణకు పాల్పడడం వల్ల పంట నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి టి.దివ్యశ్రీ అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు పౌష్టికాహారాన్ని, మందులను సోమవారం పంపిణీ చేశారు. డాక్టర్ దివ్యశ్రీ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముందు గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రావులపాలెంకు చెందిన ఎంఏ వెంకటరెడ్డి సహకారంతో గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొత్తపేట: స్థానిక బోరుసువారి సావరం విజయకనక దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం, దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య తిరు కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణకర్త, ఆలయ పోషకుడు బోరుసు వెంకట ఉదయభాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో వివిధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్–సత్య దంపతులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఇంకా రెండు రోజులు పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం జరిగే సామూహిక కళ్యాణంలో పాల్గొనే భక్తులు ఆలయ కమిటీని, లేదా ఆలయ అర్చకులను సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

వివక్షపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

సఖినేటిపల్లి: అంతర్వేదికరలోని కొత్తపేట కాలనీలో నివసిస్తున్న ఎస్సీ సామాజిక వర్గంపై కొనసాగుతున్న వివక్షపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో దళిత సంఘ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావును కలసి పై ఫిర్యాదును నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ నాయకులు ఇచ్చారు. కొత్తపేటలో దళితులు నడిచే రహదారిలో నెలకొని ఉన్న అవరోధాలపై న్యాయ విచారణ జరిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా కొత్తపేటలో నెలకొని ఉన్న సమస్యలపై విజయవాడలోని రాష్ట్ర ఎస్సీ కమీషన్‌కు, ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమీషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు దళిత నాయకులు పేర్కొన్నారు. జేఏసీ అధ్యక్షుడు చింతా రాజబాబు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నేతలు

నాలుగు గ్రామాల దాహార్తి తీర్చాలి

మామిడికుదురు: నాలుగు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. ఆయన ఎండిపోయిన ఈదరాడలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ఈదరాడ, మగటపల్లి, ఆదుర్రు, కొమరాడ గ్రామాలకు రెండు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి ట్యాంకర్ల ద్వారా పైన పేర్కొన్న నాలుగు గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. ఈదరాడ చెరువులో తాగునీటి నిల్వలు నిండుకోవడం వల్ల ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారని చెప్పారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీ వర్ధినేని రాము, పార్టీ మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, యెరుబండి సత్యనారాయణ, విష్ణు, మహేంద్ర, మోహన్, తోట సూర్యనారాయణ, వై.చిన్న తదితరులు ఉన్నారు.



ఈదరాడ చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

పీఎంఎంఎస్‌ఏతో మాతృ, శిశు మరణాల నివారణ

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయి కిషోర్ అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో సోమవారం నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏ లో సుమారు 132 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో కవితల పోటీలు

సఖినేటిపల్లి: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కవితల పోటీలు నిర్వహిస్తున్నట్టు వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, కవితలు శ్రీశ్రీ కళావేదిక వాట్సాప్ గ్రూపుల్లో రాయాలని కవులను కోరారు. నిరంతరం సాహిత్య క్రతువులో భాగంగా కవులందరినీ ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పర్యావరణంపై ప్లాస్టిక్ భూతం అనే అంశంపై నగదు బహుమతి కవితల పోటీలు ఈ మేరకు ఏర్పాటు చేశామన్నారు. కవితల పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు కింద రూ.2 వేలు, రూ.1,500, రూ.1,000, రూ.600లతో పాటు పది మందికి ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున కన్సోలేషన్ బహుమతులు ఇస్తామని అన్నారు. కాగా ఈ నెల 22న కాకినాడ పీఆర్ కళాశాల ఆవరణలో జరిగే వేదిక ద్విశతక కవి సమ్మేళనంలో పై బహుమతులు అందజేయనున్నట్టు ప్రతాప్ పేర్కొన్నారు.

మోదీ పాలనపై విజయోత్సవ సమావేశాలు

సఖినేటిపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న తరుణంలో సోమవారం మండలంలో పలు గ్రామాల్లో బీజేపీ శ్రేణులు విజయోత్సవ సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు టేకిశెట్టిపాలెం, అంతర్వేది దేవస్థానం, గొంది, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, పార్టీ రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. సుపరిపాలన, వికసిత్ భారత్, సంక్షేమం, అభివృద్ధిపై వివరించారు. పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, నాయకులు పట్టపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, యు.రామకృష్ణంరాజు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో సుపరిపాలన అందించారని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ పేర్కొన్నారు. మోడీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం మామిడికుదురులో విజయోత్సవం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్, జాతీయ రహదారుల అభివృద్ధి, డిజిటల్ ఇండియా ప్రోగ్రాం, ఉచిత ఔషధాల పంపిణీ తదితర ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత మోదీకి దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

మలేరియాను అంతం చేద్దాం

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను అంతం చేద్దామని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంతరామకృష్ణ, డి.సాయికిషోర్ కోరారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కలవచర్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో సోమవారం వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అంటూ నినాదాలు చేశారు. ఆడ అనాఫిలిస్ దోమ నుంచి వ్యాప్తి చెందే ఈ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా నివారణకు దోమల నిర్మూలనే సరైన మార్గమని తెలియజేశారు. దీనిపై ఈనెల రోజుల పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.



కలవచర్లలో వైద్యారోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న మలేరియా మాసోత్సవాల ర్యాలీ

పలువురికి కోఆర్డినేటర్ పరామర్శ

పి.గన్నవరం: మండలంలోని పలువురిని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. నాగుల్లంకలో మాతృ వియోగంతో బాధపడుతున్న పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావును గన్నవరపు పరామర్శించారు. అతని తల్లి సుభద్రమ్మ ఇటీవల మృతి చెందారు. శ్రీనివాసరావును పార్టీ సీనియర్ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, కారుపల్లి శ్రీనివాసరావు, మంగం శ్రీనివాస్, బొక్కా ఏడుకొండలు, ఆకుమర్తి రమేష్, జోగి సత్యనారాయణ, యల్లమెల్లి శ్రీనివాస్, కొల్లు రవికుమార్, ఉంద్రు రవికుమార్ తదితరులు పరామర్శించారు. అలాగే వాడ్రేవుపల్లిలో సోదర వియోగంతో బాధపడుతున్న దాకే కుమారస్వామి రెడ్డిని, ములపర్తి అమరనాథ్ పెద్దమ్మ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నాగుల్లంక శివారు కాట్రగడ్డలో పుత్రవియోగంతో బాధపడుతున్న యార్లగడ్డ పెద్దిరాజును గన్నవరపు పరామర్శించారు. పెద్దిరాజు కుమారుడు అమలాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు.



నాగుల్లంకలో శ్రీనివాసరావును పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

గోదావరిలో పడి యువకుడి మృతి

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన మోటుపల్లి స్వామినాయుడు (36) సోమవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ అదే గ్రామంలోని గోదావరి నదిలో పడి మృతి చెందాడు. గోదావరి నదిలో పడి గల్లంతైన అతడి కోసం నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. దీనిపై నగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ జీవనం సాగించే మృతుడు శనివారం స్వగ్రామం వచ్చాడన్నారు. వేసవి సెలవులకు కొడుకు, కూతురును స్వగ్రామంలో దింపి వెళ్లాడని వేసవి సెలవులు ముగుస్తుండడంతో మంగళవారం పిల్లల్ని హైదరాబాద్ తీసుకు వెళ్లాల్సి ఉందని స్వామినాయుడు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంతలోనే అతను మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో..

కొత్తపేట: మండలంలోని పలివెల–ఖండ్రిగ ఆర్అండ్‌బీ రోడ్డులో ఆగి ఉన్న కంటైనర్ లారీకి విద్యుత్ లైన్ వైర్లు తగిలి ఆ లారీ డ్రైవర్ మృతి చెందినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం శరన్ జిల్లా పచోటికార్ గ్రామానికి చెందిన కమల్ కిషోర్ షా అనే లారీ డ్రైవర్ తన కంటైనర్ లారీని పలివెల నుంచి ఖండ్రిగ పోవు రోడ్డులో పార్కింగ్ చేయగా పై నుంచి వెళ్లిన విద్యుత్ లైన్ వైర్లు తగిలి డ్రైవర్ కిషోర్ షా మృతి చెందాడు. పలివెల వీఆర్‌ఓ కె.నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పీఎం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి

అంబాజీపేట: యోగాను ప్రతి ఒక్కరూ అభ్యసించి, సాధన చేయాలని, తద్వారా ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకేటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేటలో ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.భీమారావు అధ్యక్షతన యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రతిరోజూ ఉదయం యోగా చేయడం వల్ల ఒత్తిళ్ల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. అలాగే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల వెంబడి వివిధ శాఖల మహిళలు, ఉద్యోగులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ స్లోగన్స్ నిర్వహించారు. సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, కార్యదర్శి ఇంజేటి శుభాకర్, వీఆర్‌ఓ హరికిషన్, వీఓఏలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మలికిపురం ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ రాజ్యలక్ష్మి తదితరులు

అంతర్వేదికరలో..

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామ పంచాయతీలో సోమవారం యోగా సాధనపై స్థానిక యోగా గురువు మన్నె సత్యనారాయణ గ్రామస్తులకు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. పంచాయతీలో ఈ మేరకు యోగా ఆసనాలు వేడయం, ప్రాణాయామం, ధ్యానం చేయడం వాటిపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పోతురాజు కిషోర్, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదుర్రులో..

మామిడికుదురు: యోగా ఆచరించడం వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పెరుగుతుందని లూటుకుర్రు, ఆదుర్రు సర్పంచ్‌లు అడబాల తాతకాపు, బళ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమం సోమవారం రెండు గ్రామాల్లోను జరిగింది. యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

మానవ హారంగా ఏర్పడి యోగాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బీవీవీ సత్యనారాయణ, సూర్యనారాయణ, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, ఉపాధి హామీ శ్రామికులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ ఉద్యోగులు, పలు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.



ఆదుర్రులో యోగాపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన మానవహారం



ఆలమూరులో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆలమూరులో..

ఆలమూరు: యోగా చేయడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఎ.రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీలో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు యోగా నేర్చుకుని అందులోని మెళకువలను తెలియజేయడం ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జూన్ 21న వైజాగ్‌లో నిర్వహించే యోగా డేలో పాల్గొనాలని సూచించారు. చింతలూరు నీటి సంఘం చైర్మన్ గారపాటి శ్రీనివాస చౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.